అప్పన్నపల్లి వద్ద పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

భగీరథ పైప్‌లైన్ లీకేజీ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్‌టౌన్, జూలై 19: మున్సిపాలిటీ పరిధిలోని అప్పన్నపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజీ పనులను మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మెట్టుగడ్డ, ఇండస్ట్రీయల్, పద్మావతికాలనీ, ఎదిర, తదితర ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. అదేవిధంగా ఎస్‌ఆర్ నగర్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు.

కాంగ్రెస్‌ది రైతులను ముంచే కుట్ర

◆ జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి

కోయిలకొండ, జూలై 19: రైతులు పాత కాలంలా కరెంట్ కష్టాలు పడి అన్ని రకాలుగా నష్టపోయే కట్ర కాంగ్రెస్ పార్టీ చేస్తుందని జెడ్పీటీసీ విజయబాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మల్కాపూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నందుకే ఏడాదికి రైతులు 3పంటలు పండిస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వెల్లడించారు. కాంగ్రెస్‌ను ఈ కాలం రైతులు నమ్మేస్థితిలో లేరని కర్ణాటకలో 6గంటలు కరెంట్ ఇస్తూ ఇక్కడ లేనిపోని వాగ్దానాలు చేస్తే ప్రజలు నమ్మరని తెలిపారు. మల్కాపూర్ రైతుల కోసం ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కృషితో చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయ్య, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి

◆ నర్సరీల్లో పెరుగుతున్న 5లక్షల మొక్కలు
◆ మున్సిపాలిటీలో ముమ్మరంగా హరితహారం కార్యక్రమం

‘హరితం’ సన్నద్ధం



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు పరిశీలిస్తున్న కమిషనర్

మహబూబ్‌నగర్‌టౌన్,జూలై 19 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం యజ్ఞంలా సాగుతున్నది.ప్రతి ఏడాది లక్షలాది మొక్కలు ఈ కార్యక్రమం ద్వారా జీవం పోసుకుంటున్నాయి. పట్టణంలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెరగడంతో పచ్చదనానికి కొదవలేదు.తొమ్మిదో విడుత హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు అవసరమైన మొక్కలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెంచుతున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

నర్సరీల్లో మొక్కల పెంపకం

పట్టణ ప్రగతిలో భాగంగా పట్టణ సమీపంలోని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 16 నర్సరీలో దాదాపు 6లక్షలకుపైగా మొక్కలు పెంచారు. మరో 50 వేల వివిధ రకాల పూల మొక్కలు పెంచుతున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటేందుకు వీలుగా నీడ నిచ్చే మొక్కలను కూడా ప్రత్యేకంగా పెంచుతున్నారు.

న్యూటౌన్‌లో మొక్కలకు నీరు పడుతున్న మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు

ఇప్పటికే పలు చోట్ల మొక్కలు నాటారు.పక్రియ కొనసాగుతుంది.

వివిధ రకాల మొక్కలు...

హరితహారం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లవెంట నాటేందుకు కానుగ, సీమతంగేడు, పగడం, గుల్మోహర్ వంటి మొక్కలను నర్సరీలో పెంచుతున్నారు. దీంతో పాటు పట్టణంలో ప్రజలు తమ ఇండ్లల్లో పెంచేందుకు వీలుగా వివిధ రకాల పండ్లు,పూల మొక్కలను సైతం సిద్ధం చేశారు. 50 వేల వివిధ రకాల పూల మొక్కలు పెంచేందుకు మినీ నర్సరీ ఏర్పాటు చేశారు.పట్టణ ప్రణాళికలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా అందుకు అవసరమైన ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చేపట్టారు.

సిద్ధం చేస్తున్నాం

వర్షాలు కురిసిన వెంటనే నాటేందుకు వీలుగా వన నర్సరీలో మొక్కలు పెంచుతున్నాం. ఇప్పటికే నర్సరీలో మొక్కలు పెరుగుతుండగా మరో 50 వేల పండ్లు, పూల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకున్నాం.

- ప్రదీప్‌కుమార్,
పుర కమిషనర్,
మహబూబ్‌నగర్

అనిరుధ్‌రెడ్డిని అరెస్టు చేయాలి

◆ టీఈజేఏసీ సంఘం ఆధ్వర్యంలో ఎస్పీకి ఫిర్యాదు

ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీఈజేఏసీ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జూలై 19: మహబూబ్‌నగర్ కలెక్టర్‌ను కాంగ్రెస్ నాయకుడు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అసభ్యకరంగా దుర్భాషలాడినందుకు వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు టీఈజేఏసీ జిల్లా చైర్మన్ రాజీవ్‌రెడ్డి నాయకత్వంలో ఎస్పీ నర్సింహకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో వెళ్లి కలిశారు. మంగళవారం బాలానగర్ మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కలెక్టర్ రవి నాయక్, బాలానగర్ తాసీల్దార్‌ను ఉద్దేశించి దుర్భాషలాడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. కలెక్టర్‌ను ఈ విధంగా సంబోధించడంతో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వెంటనే అనిరుధ్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు యొక్క కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఫిర్యాదుపై ఎస్పీ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని, చట్టపరంగా ముందుకెళ్తామని చెప్పారు. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎస్పీని కలిసిన వారి ఉన్నారు.

‘అనిరుధ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి’

బాలానగర్, జూలై 19: కలెక్టర్‌పై దుర్భాషలాడిన కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డి వెంటనే కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ మండల ప్రెసిండెంట్ బాలూనాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం గిరిజన సర్పంచులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్ మంజూనాయక్, సర్పంచులు తిరుపతినాయక్, గోపినాయక్, రమేశ్ నాయక్, ఖలీల్, బీఆర్ఎస్ నాయకులు జగన్‌నాయక్, శ్రీనివాసులు, పురందాస్‌నాయక్, రేడ్యానాయక్, రతన్, గోపినాయక్ తదితరులు ఉన్నారు.

నవాబ్‌పేట మండల నాయకులు

నవాబ్‌పేట, జూలై 19: కలెక్టర్‌ను తీవ్ర పదజాలంతో దూషించిన కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఎస్పీ నర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు.

జిల్లాకేంద్రంలో అనిరుధ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న లంబాడి సంఘం నాయకులు

‘కేసు నమోదు చేయాలి’

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 19: కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బుధవారం లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అనిరుధ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాలానగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో అనిరుధ్‌రెడ్డి కలెక్టర్ రవినాయక్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసభ్యకరంగా మాట్లాడారని, అయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారిపై ఇలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అధిష్టానం అనిరుధ్‌రెడ్డిపై చర్యలు తీసుకొని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. అనంతరం అనిరుధ్‌రెడ్డిపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి చందర్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, రవిందర్‌నాయక్, భగవాన్‌నాయక్, రాజునాయక్, నర్సింహనాయక్, తరుణ్‌నాయక్, లింబ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, తులసీ రామ్‌నాయక్, జాన్యనాయక్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘పాదయాత్రను అడ్డుకుంటాం’

మిడ్జిల్, జూలై 19: గిరిజన కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అనురుధ్‌రెడ్డి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఉమ్మడి జిల్లా లంబాడి ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్‌కు క్షమాపణ చెప్పకపోతే పాదయాత్రను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో లంబాడి ఐక్యవేదిక ఉమ్మడి మండల సమన్వయకర్త శంకర్‌నాయక్, నాయకులు రాందాసు, బద్రీలాల్, విజయ్‌నాయక్, శ్రీనునాయక్, గణేశ్‌నాయక్, సతీశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలి

జడ్చర్ల, జూలై 19: కలెక్టర్‌పై కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని కలెక్టర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జడ్చర్ల బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు శ్రీనునాయక్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజాహిత పాదయాత్రను గిరిజన సంఘాలు అడ్డుకుంటాయని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనిరుధ్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన సంఘం నాయకులు జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో గిరిజన ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.